సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 13 । నవంబర్ । 2024



బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ రాక

తణుకు: భారత్‌లోని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ మంగళవారం తణుకు మండలంలోని ఆంధ్రా సుగర్స్ కార్యాలయాన్ని సందర్శించారు.



'పట్టిసీమ' నుంచి నీరు విడుదల

పోలవరం రూరల్: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేశారు. 14 పంపుల ద్వారా పోలవరం కుడి కాలువలోకి 4,956 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



వేడుకగా ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల: శ్రీవారికి ఏకాదశి ఉత్సవాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఊరేగించారు.

భూ కబ్జాలు.. బెదిరింపులు

- చెలరేగిపోతున్న టీడీపీ నేతలు
- ఆలయ భూములనూ వదలని అక్రమార్కులు
- ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో ఇష్టారాజ్యం



శ్రీ వీరభద్ర స్వామి దేవాలయ భూమిలో కారు సర్వీసింగ్ సెంటర్ షెడ్డు నిర్మించిన దృశ్యం



భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయొద్దని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన మృతుడు రవీంద్ర తల్లి, కుటుంబ సభ్యులు

కామవరపుకోట: ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో మొదలైన టీడీపీ నేతల ఆరాచకాలు, భూ కబ్జాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. అధికారులను కూడా బెదిరిస్తూ యథేచ్ఛగా అక్రమాలు కొనసాగిస్తున్నారు. దేవుడి భూములను సైతం చెరబడుతున్నారు. ఇలాంటి కబ్జాలు అరికట్టడానికే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారని, కానీ టీడీపీ నాయకులు దానిపై తప్పుడు ప్రచారం చేసి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొంటున్నారు.

తెలుగుదేశం నేతల భూ అక్రమాల్లో కొన్ని..

- జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి వెంట కొత్తూరు చెక్‌పోస్ట్ సెంటర్‌లో శ్రీవీరభద్రస్వామి ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 702/4లో 97 సెంట్ల భూమి ఉంది. దాని విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.10 కోట్లకుపైనే. ఆ స్థలంలో 1,950 గజాలు 2021లో స్థానికుడైన వందనపు లక్ష్మణరావుకు.. ఏడాదికి రూ.11.40 లక్షలు చెల్లించేలా 11 సంవత్సరాలకు దేవదాయశాఖ లీజుకు ఇచ్చింది. ఆ స్థలంలో షాపులు నిర్మించి అద్దెకిస్తున్న ఆయన కూటమి ప్రభుత్వం రాగానే మిగిలిన భూమిని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. అంతకుముందు లీజును కూడా అధికారులు నామమాత్రపు ధరకు తగ్గించినట్లు తెలిసింది.
- ఈ ఆలయ భూమిలోనే కామవరపుకోట మండలం వెంకటాపురానికి చెందిన శ్రీనివాసరావు తెలుగు దేశం అండదండలతో కారు సర్వీసింగ్ సెంటర్ కోసం భారీ షెడ్డు నిర్మించాడు. భూమి కబ్జా చేసి షెడ్డు వేసినా దేవదాయశాఖ అధికారులు స్పందించలేదు.
- కామవరపుకోట మండలం కొత్తూరు సమీపంలోని రాఫిన్ రియల్ ఎస్టేట్ ఎదురుగా జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు ప్రధాన రహదారిని అనుకుని సర్వే నంబరు 390/1లో 5.70 ఎకరాల భూమి ఉంది. ఇది గతంలో భూదాన కార్యక్రమంలో భాగంగా కొత్తూరు గ్రామానికి చెందిన మేడంకి అర్జయ్యకు ప్రభుత్వం ఇచ్చింది. అర్జయ్య మృతిచెందడంతో ఆ భూమిని భార్య సుశల తన పేరిట మార్చుకుంది. 2019లో కుమారుడు రవీంద్ర పేరిట రిజిస్ట్రేషన్ చేయించింది. 2020లో రవీంద్ర అనారోగ్యంతో మృతిచెందాడు. కూటమి అధికారంలోకి రాగానే.. రూ.10 కోట్ల విలువైన ఆ భూమిని కబ్జా చేయాలని కామవరపుకోటకు చెందిన ఓ డాక్యుమెంట్ రైటర్ ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఒక మహిళను అడ్డుపెట్టుకుని ఆ భూమిని బొర్రంపాలెం గ్రామానికి చెందిన ఒక భూస్వామికి అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడని సుశీల ఆరోపిస్తోంది.
- టీడీపీ నాయకుడు, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, ఆయన సోదరుడు, అనుచరులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఏలూరుకు చెందిన ఈడుపుగంటి హరి భగవాన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆవేదన వ్యక్తం చేశారు. టి.నరసాపురం మండలం బొర్రంపాలెం నుంచి కామవరపుకోట వెళ్లే రోడ్డు వెంట 15 ఎకరాల పామాయిల్ తోటను హరిభగవాన్ బ్యాంకు ఆన్‌లైన్ వేలంలో రూ.3.70 కోట్లకు పాడుకున్నారు. తను ఆ భూమిలోకి వెళ్లకుండా గంటా మురళి, ఆయన సోదరుడు, అనుచరులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని హరి భగవాన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామానికి చెందిన దళితుడైన బిరుదుగట్ల కృష్ణమూర్తికి జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం రెవెన్యూ పరిధిలో 597/3లో 2.10 ఎకరాల భూమి ఉంది. దాంట్లో పామాయిల్ సాగు చేస్తున్నాడు. ఆ భూమిని కబ్జా చేసేందుకు యర్రంపేటకు చెందిన తెలుగుదేశం వర్గీయుడు చెరుకూరి సత్యజానకి నరసింహారావు ప్రయత్నిస్తున్నాడు. కృష్ణమూర్తిని పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుని దౌర్జన్యం చేశాడు. కృష్ణమూర్తి అధికారుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నాడు.

రక్షణ కల్పించండి



బ్యాంకు వేలంలో భూమిని ఆన్‌లైన్‌లో కోర్టు ద్వారా డబ్బులు చెల్లించి కొనుగోలు చేశాను. స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, ఆయన సోదరుడు, అనుచరులు నాపై దౌర్జన్యం చేసి, భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి నుంచి నాకు రక్షణ కల్పించాలి.

– ఈడుపుగంటి హరిభగవాన్, చైత్ర హాస్పిటల్ యజమాని, ఏలూరు

న్యాయం చేయండి



మా తాతల నుంచి నాకు సంక్రమించిన భూమిలో పామాయిల్ సాగు చేస్తున్నాను. టీడీపీ నాయకుడు చిలుకూరి సత్యజానకి నరసింహారావు దళితుడినైన నాపై దౌర్జన్యం చేసి నా పొలం ఆక్రమించాడు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. నరసింహారావు నుంచి రక్షణ కల్పించాలి.

– బిరుదుగట్ల కృష్ణమూర్తి, రాజవరం, కొయ్యలగూడెం మండలం

భూములను పరిరక్షించాలి



కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పేదల భూములను కబ్జా చేసేందుకు తెగబడుతున్నారు. దేవాలయ భూములను సైతం ఆక్రమించేందుకు తెరదీశారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు రక్షణ కల్పించడంతో పాటు కబ్జాదారుల నుంచి భూములను పరిరక్షించాలి.

– కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్, చింతలపూడి

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

కామవరపుకోట చెక్‌పోస్ట్ సెంటర్లో శ్రీవీరభద్ర స్వామి దేవాలయ భూమి ఆక్రమించి షెడ్డును నిర్మించిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసి, ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. వారి నుంచి ఆదేశాలు రాగానే కబ్జాదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– టి.లక్ష్మి, దేవదాయశాఖ అధికారి

న్యూస్‌రీల్

ఉమా సోమేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన అనంతరం స్వామి దర్శనం

భీమవరం (ప్రకాశం చౌక్): పంచారామ క్షేత్రంలో కొలువైన శ్రీ ఉమా సోమేశ్వర స్వామికి కార్తీక మాసం రెండో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

కేంద్ర మంత్రితో ఎన్‌సీసీ ప్రతినిధుల భేటీ



మంత్రితో భేటీ అయిన ఎన్‌సీసీ ప్రతినిధులు

తణుకు, పెనుండ, భీమవరం (ప్రకాశం చౌక్): నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) కమిటీ ప్రతినిధులు న్యూఢిల్లీలోని మైనార్టీ వ్యవహారాల కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుతో మంగళవారం భేటీ అయ్యారు. ఇటీవల తణుకు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రైస్తవ ఉజ్జీవ సభలను అధికారులు అడ్డుకున్న అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి నివేదికను మంత్రికి అందజేశారు. వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రత్యేక కమిటీను నియమించనున్నట్లు హామీ ఇచ్చారని నాయకులు వెల్లడించారు. అనంతరం సుప్రీం కోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి కేజీ బాలకృష్ణన్‌ను కలిసి వివరాలను వెల్లడించినట్లు చెప్పారు. ఎన్‌సీసీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌పాల్, ఏపీ అధ్యక్షుడు డాక్టర్ బి.జార్జ్‌ముల్లర్, ఏపీ స్టేట్ కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒ.మనోజ్‌బాబ్ పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలకు అవార్డులు



అవార్డులు అందచేస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ గోపాల్, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలను అవార్డులు వరించాయి. గత నెలలో బెంగళూరులో ఐసీఏఆర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టీకల్చర్ రీసెర్చ్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు పలు అంశాలపై ప్రజెంటేషన్‌లు, పరిశోధన విషయాలు వివరించారు. ఉత్తమ జీవ సంబంధమైన నియంత్రణ పరిశోధనకు అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎస్‌బీవీ చలపతిరావుకు ఎస్.సీతానంతం అవార్డు వచ్చింది. ఉద్యాన పంటల్లో తెగుళ్ల నియంత్రణకు కృషి చేసినందుకు వెంకట్రామన్నగూడెం పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.నాగలక్ష్మికి ఫెలోషిప్ లభించింది.

ఖాతా నుంచి రూ.46.30 లక్షలు గల్లంతు

ఏలూరు టౌన్: ఏలూరుకు చెందిన కె.శేషగిరి ప్రసాద్ ఖాతాకు గుర్తు తెలియని ఖాతా నుంచి పొరపాటున రూ.20 వేలు వచ్చాయి. ఆ నగదును పంపాలని ఆ గుర్తుతెలియని వ్యక్తి అడగడంతో అతని ఖాతాకు రూ. 20 వేలు పంపగానే శేషగిరి ప్రసాద్ అకౌంట్‌లోంచి రూ.46.30 లక్షలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అశోక్‌నగర్‌కు చెందిన శేషగిరి ప్రసాద్ ఖాతాకు ఈనెల 8న రూ.20 వేలు వచ్చాయి. పొరపాటున వచ్చాయని తిరిగి వాటిని తన ఖాతాకు వేయాలని ఆ గుర్తు తెలియని వ్యక్తి ప్రాధేయపడ్డాడు. అతని మాటలు నమ్మిన శేషగిరి ప్రసాద్ తిరిగి ఆన్‌లైన్‌లో ఆ మొత్తాన్ని పంపాడు. ఈ నెల 10న తన ఖాతాను పరిశీలించుకోగా రూ.46.30 లక్షలు సైబర్ నేరగాళ్లు అపహరించినట్లు గుర్తించారు. దీంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐ వైవి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీవారి తెప్పోత్సవానికి సర్వం సిద్ధం

నేడు పుష్కరిణిలో వైభవంగా వేడుక





శ్రీవారి పుష్కరిణిలో హంస వాహన తెప్ప, సాగరం మధ్యలో మండపం

ద్వారకాతిరుమల: శ్రీవారి పుష్కరిణి (నృసింహ సాగరం)లో బుధవారం రాత్రి జరగనున్న చినవెంకన్న తెప్పోత్సవానికి సర్వం సిద్ధమైంది. వేడుకలో భాగంగా ఉభయ దేవేరులతో స్వామివారు విహరించనున్న తెప్పను హంస వాహనంగా అలంకరిస్తున్నారు. తెప్పలో పచ్చిపూల మండపాన్ని నిర్మిస్తున్నారు. భక్తులకు రక్షణ కల్పించేలా పుష్కరిణి గట్లపై బారికేడ్లు నిర్మించారు. సాగరం మధ్యలోని మండపానికి, గట్లపైన, చెట్లకు విద్యుద్దీప అలంకారాలు చేశారు. దాంతో పుష్కరిణి పరిసరాలు మిరుమిట్లు గొలుపుతున్నాయి. పుష్కరిణి ముందు ఏర్పాటు చేసిన స్వామివారి భారీ విద్యుత్ కటౌట్ కనువిందు చేస్తోంది. స్వామి, అమ్మవార్లు ఆలయం నుంచి తొళక్క వాహనంపై బయల్దేరి పుష్కరిణి వద్దకు రాత్రి 8 గంటల సమయానికి చేరుకుంటారని, ఆ తరువాత తెప్పోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం అందించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): మహిళా వ్యవసాయ వ్యాపారవేత్తలకు అండగా నిలిచేందుకు గ్రామీణ్ ఫౌండేషన్ సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గ్రామీణ్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై జిల్లాలో వివిధ చిన్న తరహా పరిశ్రమల వ్యవస్థాపకులను ప్రోత్సహించేలా సాయంపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 3.10 కోట్ల స్వయం సహాయక సంఘాల మహిళలు సుమారు రూ.3 వేల కోట్ల రుణాలు పొందుతున్నారని, వాటిని అభివృద్ధి ఆధారిత కార్యక్రమాల్లో పెట్టుబడులు పెట్టి భాగస్వాములుగా ఉంచేందుకు సహకరించాలన్నారు. మరింత మంది మహిళలను వివిధ రంగాలలో వ్యవస్థాపకులుగా నిలబెట్టేందుకు గ్రామీణ్ ఫౌండేషన్ సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ కోరారు. సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భారతి మాట్లాడుతూ గ్రామీణ్ ఫౌండేషన్‌ను అమెరికాలో స్థాపించారని.. పేద వర్గాలతో కలిసి పనిచేస్తూ, పేదలకు సాయపడడానికి మొబైల్ ఫోన్ ఆధారిత అప్లికేషన్లను అభివృద్ధి చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం అవకాశాలను పరిశీలించి గ్రామీణ్ ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

క్రైస్తవులపై చిన్నచూపు

పాస్టర్ల వ్యక్తిగత సమాచారం సేకరించడంపై ఆందోళన



నరసాపురంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పాస్టర్లు

నరసాపురం: ప్రభుత్వ ప్రోద్బలంతో కొన్నిరోజులుగా అధికారులు సేకరిస్తున్న వ్యక్తిగత సమాచార పక్రియను వెంటనే నిలుపుదల చేయాలని నరసాపురం డివిజన్‌లోని వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు, దైవ సేవకులు డిమాండ్ చేశారు. మంగళవారం పాస్టర్ వై.రూబెన్ ఆధ్వర్యంలో నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. భారీ సంఖ్యలో పాస్టర్లు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చదలవాడ జ్ఞానప్రకాష్, వై.రూబెన్ మాట్లాడుతూ పాలకొల్లుకు చెందిన ఓ వ్యక్తి సమాచారహక్కు చట్టం ద్వారా గ్రామాల వారీగా ఎన్ని చర్చిలున్నాయి, ఎంతమంది పాస్టర్లు ఉన్నారు, చర్చిలు సొంత స్థలాల్లో ఉన్నాయా? అనే వివరాలు కావాలని దరఖాస్తు చేశాడని అధికారులు చెబుతున్నారన్నారు. ఈ నెపంతో కొన్ని రోజులుగా అధికారులు పాస్టర్ల వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్నారని అన్నారు. సెక్యులర్ దేశంలో ఈ తరహా చర్యలు దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులపై కక్షతో ఇదంతా చేస్తుందని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో పాస్టర్లకు ఎంతసొమ్ము ఇచ్చారని ఆరా తీస్తున్నారన్నారు. ఈ చర్యలు వెంటనే ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. క్రైస్తవుల ఓట్లు కావాలి కానీ, క్రైస్తవుల బాధలు ఈ ప్రభుత్వానికి పట్టవా? అని నినాదాలు చేశారు. రెండు గంటలపాటు నినాదాలు, ప్రార్థనలు, ఆందోళనతో సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణను హోరెత్తించారు. ఆర్డీవో దాసి రాజుకు వినతిపత్రం ఇచ్చారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు సికిలే పెర్సిపాల్, ఏడీవీ ప్రసాద్, జాషువా, గుమ్మాపు శ్యామ్, కృపారావు, కృపావరం, నేతల చిన్నా, శ్యాంసన్, ఏలియారాజు, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు అడిగిన వైద్యుడిపై విచారణ



బాధితురాలిని విచారిస్తున్న డాక్టర్ వి.శ్రీనివాస్, చిత్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ

సాక్షి స్పందన

తణుకు అర్బన్: వైద్యం సర్కారు ఆస్పత్రికి వచ్చిన మహిళను రూ.20 వేలు ఇస్తే ఆపరేషన్ బయట చేస్తానన్న ఘటనకు సంబంధించి జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యుడిపై మంగళవారం ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. ఉండ్రాజవరం మండలం వెలగదుర్రుకు చెందిన పి.జ్యోతి గొంతు, ముక్కు నొప్పితో ఇబ్బంది పడుతున్న తన కుమారుడిని ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ బి.ప్రశాంత్‌కు చూపించగా.. వైద్యుడు రూ.20 వేలు అడిగారని చేసిన ఫిర్యాదు మేరకు డీసీహెచ్ఎస్ విచారణకు ఆదేశించారు. ఈ విషయాన్ని అక్టోబరు 15న సాక్షి పత్రికలో 'రూ.20 వేలు ఇస్తేనే ఆపరేషన్' శీర్షికన కథనం ప్రచురితమైంది. మంగళవారం నూజివీడు ఏరియా ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వి.శ్రీనివాస్ బాధితురాలు జ్యోతితోపాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ వెలగల అరుణ, ఇతర వైద్యులను ఆరాతీశారు. బాధితురాలు, వైద్యుల నుంచి స్టేట్‌మెంట్‌ను లిఖితపూర్వకంగా తీసుకున్నారు.

ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పర్యటన



మహదేవపట్నంలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

ఉండి: ఉండి మండలం మహదేవపట్నంలో మంగళవారం నలుగురు ట్రైనీ ఐఏఎస్‌లు అంకిత్ శాండిల్య, యశ్.సింగాల్, నితీష్ కుమార్, రాజేష్ కుమార్‌ల బృందం పర్యటించింది. సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐఏఎస్‌ల బృందం గ్రామంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పర్యటించి ఆయా కార్యాలయాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ, హెల్త్ సబ్ సెంటర్, డ్వాక్రా గ్రూపులు, బ్యాంక్, ఆలయాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎస్.రవీంద్ర, తహసీల్దార్ కే నాగార్జున, గ్రామ కార్యదర్శి కే.గోపాల కృష్ణ తదితర అధికారుల బృందం అన్ని వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న కార్యక్రమాలు, పథకాల అమలు వాటి తీరుతెన్నులు తెలుసుకున్నారు.

క్షేత్ర స్థాయిలో అవగాహన పెంచుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): క్షేత్ర స్థాయిలో అవగాహన పెంచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జేసీని కలిశారు. పలు విషయాలపై అవగాహన పెంచుకున్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

భీమవరం: రైతు ఎంపిక చేసుకున్న మిల్లులో ధాన్యం అమ్మడానికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి కమిటీలు నిత్యం రైతులకు సేవలు అందించాలని తెలిపారు.

దొంగను పట్టించిన సీసీ కెమెరా



బ్యాంక్ దొంగతనం వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం: బ్యాంక్‌లో చోరీకి యత్నించిన వ్యక్తిని సీసీ కెమెరా పట్టించింది. దీంతో పోలీసులు దొంగను అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య విలేకర్లకు వివరించారు. కాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏలూరుపాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఈనెల 7వ తేదీన కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన పిప్పల రాజేష్ దొంగతనానికి యత్నించాడు. బ్యాంక్ భవనం కిటికీ ఊచలను కట్టర్‌తో తొలగించి లోనికి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా బ్యాంక్‌లోని అలారం మోగడంతో భయపడి పారిపోయాడు. దొంగతనం చేయడానికి ముందురోజు రాజేష్ బ్యాంక్‌కు వెళ్లి రెక్కీ నిర్వహించాడు. చోరీ యత్నంపై బ్యాంక్ అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా బ్యాంక్‌లోని సీసీ ఫుటేజీలను డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, కాళ్ల ఎస్సై నాళం శ్రీనివాసరావు మరొక నలుగురు సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి పరిశీలించారు. ఒకరి కదలికలు అనుమానాస్పదంగా కన్పించడంతో అతనిపై నిఘా పెట్టారు. ఈ తరుణంలో మంగళవారం కాళ్ల మండలం సీసలి గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద యూనిఫాంలో ఉన్న పోలీసులను చూసి రాజేష్ తప్పించుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు అతడిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. బ్యాంక్‌లో దొంగతనానికి యత్నించడమేగాక దొడ్డనపూడి గ్రామంలో బంగారం చోరీ చేసినట్లు రాజేష్ అంగీకరించాడు. దీంతో అతని వద్దనుంచి రూ.20 వేలు నగదు, మోటారుసైకిల్, విద్యుత్ కట్టర్, కటింగ్ ప్లేయర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ జయసూర్య వివరించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన సీఐ జగదీశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది రాజేష్, మహేష్, ధనుంజయ నాయుడు, సుధాకర్‌లను ఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

తాడేపల్లిగూడెం: పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పట్టణంలోని నన్నయ్య కళాశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వక్తలు పిలుపునిచ్చారు. ఎంబీఏ విద్యార్థులకు ప్రిన్సిపాల్ టి.అశోక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిశ్రమలు స్థాపించాల్సిన అవసరం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గురించి వక్తలు టి.భోగేశ్వరరావు, గరికిపాటి బాపయ్యశర్మలు మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటు ఆవశ్యకత గురించి విశదీకరించారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకుడు అప్పాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు



బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న సీఐ

తణుకు: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బెల్ట్ షాపులపై మంగళవారం అధికారులు విస్తృతంగా దాడులు చేశారు. పెనుమంట్ర మండలం మాముడూరు గ్రామానికి చెందిన వాసంశెట్టి రాంబాబు బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి అతని వద్ద 7 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఈదాడుల్లో ఎస్ఐలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు. ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని సీఐ కోరారు.

ప్రణాళికతోనే సమగ్రాభివృద్ధి

ఇరగవరం: ప్రణాళికతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చే నిధులు ప్రణాళిక ప్రకారం ఖర్చు చేస్తే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, డ్వాక్రా వివోఏలు పాల్గొన్నారు.

కృష్ణపరమాత్మకు పంచామృతాభిషేకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక శుద్ధ ప్రబోధిని ఏకాదశి సందర్భంగా స్థానిక రామచంద్రరావు పేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలోని కృష్ణపరమాత్మకు మంగళవా రం పాదిలి శ్రీనివాస వర్మచే నిత్య అర్చనలు, పంచామృతాలో అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. స్వామి వారిని పట్టు వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్ రాజు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

గుబాళించిన బంతిపూల సాగు

- 70 సెంట్లలో బిగ్ బాల్ రకం బంతి
- సీజన్‌లో విరగబూసిన బంతి పూలు
- విభిన్నంగా పంట సాగు



తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో బంతి పూల సాగు దృశ్యాలు

తాడేపల్లిగూడెం రూరల్: పూల సాగు పేరు చెబితే ముందుగా గుర్తొచ్చేది కడియపు లంక గ్రామం. రాష్ట్రం నలుమూలలకు ఇక్కడ నుంచే పువ్వులు ఎగుమతి అవుతుంటాయి. అయితే ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకున్న కౌలు రైతు గోనేరు శ్రీను తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో 70 సెంట్ల విస్తీర్ణంలో బంతి పూల సాగు చేపట్టాడు. స్థానికంగా ఉన్న రైతులు, వీడియోలు ఆధారంగా కుప్పంలోని అమృత నర్సరీ నుంచి రూ.10వేలు ఖరీదు చేసి బిగ్ బాల్ రకం బంతి నారును ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. దీంతో వారు నేరుగా ట్రాన్స్‌పోర్టు ద్వారా నారును సరఫరా చేశారు. ఎరువులు, పురుగు మందులు, పశువుల ఎరువుల వెరసి రూ.7వేలు వరకు వెచ్చించారు. సెప్టెంబరు 15వ తేదిన నారును వేశారు. పంట సమయం 45 రోజులు కాగా, రైతు శ్రీను 55 రోజులకు మొదటి కోత కోశారు. దాదాపు 60 కిలోల బంతి పూలు దిగుబడి వచ్చింది. కిలో రూ.50లు చొప్పున మార్కెట్‌లో విక్రయించారు. తద్వారా ఒక్క కోతలోనే రూ.3వేలు ఆదాయాన్ని రైతు ఆర్జించాడు. జనవరి నెలాఖరు వరకు బంతి పూలు దిగుబడి వస్తుందని రైతు శ్రీను తెలిపారు.

బంతి పూల సాగుతో రైతుకు మేలు



రైతులంతా ఒకే రకం పంటను సాగు చేయడం మంచిది కాదు. పంట మార్పిడి విధానం ద్వారా భూమి సాంద్రత పెరుగుతుంది. బంతి పూల సాగు చేపట్టే క్రమంలో సమీప రైతుల సలహాలను సైతం తీసుకోవడం జరిగింది. పరిసరాల్లో బంతి పూల సాగు లేకపోవడంతో విభిన్నంగా ఆలోచించి సాగు చేపట్టాను. తన ఆలోచన కూడా ఫలించడం, బంతి పువ్వు ఆకృతి, నాణ్యత బాగుండటంతో మంచి ధర లభించడంతో లాభదాయకమైన ఆదాయం వచ్చింది.

– గోనేరు శ్రీను, కౌలు రైతు, మెట్ట ఉప్పరగూడెం, తాడేపల్లిగూడెం మండలం

కూటమి ప్రభుత్వ బడ్జెట్ అంకెల గారడీ బడ్జెట్



మండల నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ బడ్జెట్ అని, సామాన్యులకు ఉపయోగకరంగా లేదని పట్టణ సీపీఐ కార్యదర్శి మండల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విపరీతంగా పెరిగిన ధరలతో సామాన్యులు, పేద ప్రజలు విలవిలలాడుతున్నారని, కనీసం ధరల ఊసే ఎత్తలేదని విమర్శించారు. వెనుకబడిన తరగతుల జనాభాకు ఏ మాత్రం సరిపోని అరకొర కేటాయింపులు చేసి ఎన్నికల హామీలు నీరుగార్చేసి మోసం చేశారన్నారు. వ్యవసాయ రంగానికి చాలీ చాలని నిధులు కేటాయించి రైతుల పంటల ఇన్సూరెన్స్, మేలు రకం విత్తనాలు పంపిణీ, కౌలు రైతుల సంక్షేమం ప్రస్తావించలేదని, దారుణంగా బడ్జెట్ పేరుతో అవమానించారని చెప్పారు. పాలన లోపా లు ఉన్నాయని, సంక్షేమాలు అమ లు చేయకుండా గత ప్రభుత్వంపై నెట్టేసి తప్పించుకోవడం సరికాదని తప్పు పట్టారు. రానున్న రోజులలో సమస్యలను పరిష్కరించేందుకు పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఓపీ సేవలు పెంచాలి



తణుకు అర్బన్ హెల్త్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు

తణుకు అర్బన్: అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఓపీ సేవలు పెరిగేందుకు వైద్యవర్గాలు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. తణుకులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ వైద్యసేవల కోసం వచ్చే రోగులతో వైద్యులు, సిబ్బంది వైఖరి బాగుండాలని సూచించారు. జ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, జ్వరాల కేసులకు సంబంధించి ఎక్కువగా టైఫాయిడ్, వైరల్ జ్వరాలు అధికంగా నమోదవుతున్నాయని అన్నారు. చలిగాలులు ప్రారంభమైన నేపథ్యంలో వైద్యవర్గాలు అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రులకు వచ్చే రోగులకు మంచి ఆహార అలవాట్లపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సెంటర్‌లలోని రికార్డ్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ ఎం.గులాబ్ రాజ్‌కుమార్, వైద్యులు డాక్టర్ కె.పృథ్వీరాజ్, డాక్టర్ రాజా నాగభూషణం, డాక్టర్ ఎన్.డానియల్‌రాజ్, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, ఫిమేల్ హెల్త్ సూపర్‌వైజర్లు సునీత, రత్నాభాయ్, హెల్త్ అసిస్టెంట్ ఎన్.తాతాజీ, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కొమ్మరలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: గ్రామీణ ప్రాంత ప్రజలకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మానవతా సంస్థ చైర్మన్ ఆనాల ఆదినారాయణ అన్నారు. మంగళవారం అత్తిలి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం విష్ణు డెంటల్ కళాశాల వారి సౌజన్యంతో అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా మానవతా హెల్త్ కన్వీనర్ కర్రి నరేంద్రారెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనాల ఆదినారాయణ మాట్లాడుతూ దంతాల పట్ల ప్రతీ ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. భీమవరం విష్ణు డెంటల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో వైద్యుల బృందం 150 మందికి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు తెలిపి, ఉచితంగా మందులను అందజేసారు. కార్యక్రమంలో మానవతా రీజియన్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, అత్తిలి మానవతా మండల అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు, బోడపాటి సూర్యచంద్రరావు, తోట సుబ్బారావు, కొరిపల్లి హరి, కుక్కల వెంకట రామారావు, కొరిపల్లి విజయ్‌కుమార్, అల్లబాని అప్పారావు, పెన్మెత్స పుల్లంరాజు, ఎలమంచిలి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

16న దేవుని రాజ్య సువార్త సభ

పెంటపాడు: ఈనెల 16న ఉదయం 10 గంటలకు గూడెం క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో దేవుని సువార్త సభ నిర్వహించనున్నట్లు బ్రదర్ రొక్కాల నాగబుజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరంకు చెందిన సువార్తికుడు బ్రదర్ బి. జన్ రత్నం, పాలకొల్లు క్రీస్తు సంఘానికి చెందిన బ్రదర్ ఎబనేజర్‌లు పాల్గొంటారన్నారు. ఈ సభలలో క్రైస్తవులు పాల్గొని దేవుని దీవెనలు పొందాలని ఆయన కోరారు.

బాలికల హక్కులపై అవగాహన

అత్తిలి: బాలికలు తమ హక్కులు, బాధ్యత లపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ అత్తిలి సెక్టార్ సూపర్‌వైజర్ కె కుమారి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం పాలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చైల్డ్ రైట్స్ కన్వెన్షన్ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా బాలికలకు వారి హక్కులు, బాధ్యతలు, బాలల న్యాయచట్టం, పోక్సో చట్టం, బాల్యవివాహ నిషేధ చట్టంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ విజయ సత్య, సీహెచ్ సత్యనారాయణ, కె స్వర్ణలత, వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఉండి: ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉండి శాఖా గ్రంథాలయ అధికారి జేవీ కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే బాలల దినోత్సవం, పుస్తక పఠనం, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక ప్రదర్శన, గ్రంథాలయాల ఏర్పాటులో ప్రముఖుల పాత్ర తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

14న అలంపురానికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు: ఈనెల 14న అలంపురం వెంకటరమణ ఛారిటీ ఆస్పత్రికి ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, అంకాలజీ, ఐవీఎఫ్‌తో పాటు, గైనకాలజీ, పీడ్రియాట్రిక్ వైద్యులు వచ్చి రోగులకు ప్రత్యేక వైద్యపరీక్షలు చేస్తారన్నారు. 14న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించబోయే ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించాలి

పెంటపాడు: పదోతరగతి పరీక్షలలో నూరు శాతం విజయాలు సాధించేలా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృషి చేయాలని పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూలు హెచ్‌ఎం నారిపాటి రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం స్కూలు ఎస్ఎంసీ అత్యవసర సమావేశం ఎస్ఎంసీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రతి ఏటా బేసిక్‌స్కూల్లో నూరుశాతం ఫలితాలు సాధిస్తున్న రీతిగానే ఈ ఏడు మరింత శ్రద్ధ వహించి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం తమ స్కూలుకు చెందిన పీఈటీ పోశియ్య జాతీయస్థాయి సివిల్‌సర్వీస్ వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడంపై పలువురు ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యుల ఆధ్వర్యంలో పోశియ్యను ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కుట్ర చేస్తున్నాయని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల గౌరవాధ్యక్షులుడు చీకటిమిల్లి మంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వర్గీకరణకు ఇచ్చిన తీర్పును న్యాయమూర్తులు ధర్మాసనం పునః సమీక్షించాలని కోరారు. ఈ మధ్య కాలంలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులు అన్ని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పులని, భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, రక్షణలు భద్రతలు నిర్వీర్యం అయ్యేలా పాలక వర్గాలు తమ రహస్య అజెండాను సుప్రీంకోర్టు తీర్పు ద్వారా అమలు చేస్తున్నాయని వాపోయారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రద్దు చేయడం, ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఎజెండా కావడం, దీనిలో భాగంగానే ఎస్సీ, ఎస్టీ క్రిమిలేయర్ తీర్పు వచ్చిందని వాపోయారు. రిజర్వేషన్ వర్గీకరణ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు తటస్థ వైఖరి అవలంభించాలని, ఎనభై లక్షల మంది మాలలు తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాలమహానాడు నాయకులు బేతాళ శరత్ బాబు, నల్లి రాజేష్, రవి కుమార్, రవితేజ, కొండల రావు, జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గ్యాస్ పంపిణీ ఏజెన్సీ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు: హెచ్‌పీ గ్యాస్ జిల్లా సేల్స్ అధికారుల కార్మిక వ్యతిరేక విధానాలు కారణంగా కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ విమర్శించారు. మంగళవారం స్థానిక హెచ్‌పీ గ్యాస్ సుబ్బారావు అండ్ కో కంపెనీ వద్ద సేల్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తీరు కారణంగా కార్మికులు ఉపాధి కోల్పోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ప్రకారం కార్మికులు ఉపాధి దెబ్బతీస్తున్న సేల్స్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో నిబంధనలు ఉన్నప్పటికీ గ్యాస్ కార్మికులకు ఎందుకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటివి అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారులు, యాజమాన్యాలు మధ్య కార్మికులు నలిగిపోతున్నారని అన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్‌కి ఏ ప్రమాదం సంభవించినా పట్టించుకోని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్ ఉన్నారని అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు ఆపకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ప్రతాప్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గార రంగారావు, ముత్యాలరావు, పద్మారావు, ప్రసాద్, పాపారావు, సింహాచలం, రవితేజ, శ్రీనివాస్, ఈశ్వరావు, ధర్మారావు, సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా మండలాన్ని అభివృద్ధి చేయాలి



తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన శిక్షణ కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రణాళికాబద్ధంగా మండలాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో రెండురోజుల మండలస్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పరిస్థితి వివరించడంతో పాటు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, వ్యవసాయశాఖ ఏవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, వెలుగు ఏపీ ఎం జీవీకేడీ ఎం.లక్ష్మి, వైద్యాధికారులు వీరవెంకటేష్, శ్రీహర్ష, హౌసింగ్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

సందడిగా ఆర్యవైశ్య సంఘ కార్తీక వన సమారాధన



నీలాద్రిపురం గ్రామంలో ఆర్యవైశ్య సంఘం కార్తీక వన సమారాధన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘ కార్తీక వన సమారాధన సందడిగా సాగింది. ఈ సందర్భంగా సరదా సరదా మాటలతో ఆద్యంతం ఆనందంగా, ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కుసుమంచి వెంకటేశ్వరరావు, బోనగిరి రమేష్‌లు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘ ఉన్నతికి సభ్యులంతా పాటుపడాలని సూచించారు. అనంతరం జరిగిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు గ్రంధి సత్యనారాయణ, కోనా శ్రీనివాస్, నారాయణ విశ్వేశ్వరరావు, పేరూరి కాశియ్య, సంఘ గౌరవాధ్యక్షుడు కామిశెట్టి కాశీ విశ్వనాథం, గౌరవ కోశాధికారి పొన్నగంటి శ్రీనివాస్, కోశాధికారి నున్నా గంటారావు గుప్తా, గౌరవ సలహాదారు గమ్మిడి ఎల్‌వీవీ.మల్లిఖార్జున రావు, ఈసీ సభ్యులు చీమకుర్తి ప్రసాద్, మారం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్య నియమా లు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధి కారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో 23, 24, 25 వార్డులలో మంగళవారం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెక్టర్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పరిశీలనలు, ర్యాలీలు నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలలో వార్డు ఆరోగ్య, పోషణ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ప్రజలందరూ వారానికి ఒక్కసారి డ్రై డే, ఫ్రై డే పాటించాలన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు కృషి చేయాలని తదితర విషయాలను అవగాహన చేశారు. ఆరోగ్య కార్యదర్శులు ఆదిలక్ష్మి, జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, జ్యోతి కుమారి, లక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, శానిటేషన్ కార్యదర్శులు రఘువీర్, ప్రసాద్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

అత్తిలి: దొంగతనం కేసులో నిందితుడైన ఖండవల్లి సీతారాముడును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదున్నర కాసుల బంగారం, 275 గ్రాముల వెండిని రికవరీ చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు మంగళవారం తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం తణుకు కోర్టుకు హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

గుడి నాదే..చందా ఇవ్వాల్సిందే..

- అన్నదానం కోసం తమకు నచ్చిన చందా రాయాలంటూ ఓ వ్యక్తి నిర్వాకం
- తక్కువ చందా రాస్తే ఎలా అంటూ భక్తులపై దూషణలు
- ఇదెక్కడి చోద్యం అంటూ నివ్వెరపోతున్న భక్తులు



టెంట్‌లో చందాలు డిమాండ్ చేస్తున్న వారితో వాగ్వాదానికి దిగిన భక్తుడు

తణుకు అర్బన్: చందాలతో దందాలకు దిగుతున్నారంటూ దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన తణుకు సజ్జాపురం సోమేశ్వరస్వామి ఆలయం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఏళ్ల తరబడి ఆలయాన్ని అంటిపెట్టుకుని ఆలయం మాదే అని చెప్పుకునే ఒక వ్యక్తి అన్నదానానికి ఆలయం వద్ద చందాలు వసూలు చేసే కార్యక్రమం చేపట్టారు. డిసెంబరు 7వ తేదీన షష్టి సందర్భంగా శివాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నామని చందాలు వసూలు చేస్తున్నారు. అయితే భక్తులు తమకు తోచిన విధంగా చందాలు ఇచ్చే పరిస్థితి అన్ని ఆలయాల వద్ద ఉండడం సహజం. కానీ తణుకు సోమేశ్వరస్వామి ఆలయం వద్ద మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటుందని భక్తులు చెబుతున్నారు. అన్నదానం మంచి విషయమేనని కానీ సదరు నిర్వాహకుడికి నచ్చిన విధంగా చందా రాయకపోతే అందరి ముందు ఇష్టానుసారంగా తిడుతున్నారని భక్తులు వాపోతున్నారు. సరిగ్గా ఇదే ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోసల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండడంతో భక్తులు విస్తుపోతున్నారు. ఆలయానికి వచ్చిన ఒక భక్తుడు తిరిగి వెళ్లే క్రమంలో ఆలయం ముందు వేసిన టెంట్‌లో కూర్చున్న వారికి రూ.100లు చందా ఇవ్వగా నువ్విచ్చే వంద రూపాయలతో ఏంచేయమంటావంటూ ఆ వ్యక్తి దూషించడంతో చిర్రెత్తుకొచ్చిన భక్తుడు కూడా వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్వాహకుడు మీ చందా మాకు అక్కర్లేదు వెళ్లిపోమని అనడం మీ ఆలయమా ఇది వెళ్లిపోమనడానికి నీవెవరు అంటూ భక్తుడు తిరగబడిన వీడియో తణుకు ప్రాంతంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. మాకు నచ్చినట్లుగా మీరు చందాలు ఇవ్వాల్సిందేనంటూ ఆలయం వద్ద బలవంతపు వసూళ్లకు దిగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఆలయం వద్ద అన్నదానం కోసం డబ్బులు అడిగే తీరు భక్తులకు ఇబ్బందిగా మారిందని నలుగురిలోను నవ్వులపాలు చేసే విధంగా గుడి నాదే అనే ఒక వ్యక్తి చేస్తున్న పైరవీలకు స్థానికులు, భక్తులు కోపోద్రిక్తులవుతున్నారు. వచ్చేనెలలో నిర్వహించే అన్నసమారాధనకు గత 20 రోజులుగా బలవంతపు వసూళ్లకు దిగుతున్నారని భక్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయంపై అధికారులు పట్టించుకోకపోవడాన్ని భక్తులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆలయ ఈవో జానకిరామరాజును వివరణ కోరగా అన్నదానం, దానికి సంబంధించిన చందాల వ్యవహారం ఆలయానికి సంబంధం లేదన్నారు. ఆలయం ముందు టెంట్‌వేసి చందాలు వసూలు చేస్తున్నారని తెలియగానే టెంట్ కూడా తొలగింప జేసినట్లు తెలిపారు.